క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి రానీయొద్దు



సుంకేసుల బ్యారేజ్‌లో నీటిని పరిశీలిస్తున్న కమిషనర్, ఇంజినీర్లు

కర్నూలు(టౌన్): ప్రస్తుత వేసవి కాలంలో నగర ప్రజలకు తాగునీటి ఎద్దడి రానివ్వకుండా పటిష్ట మైన చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ భార్గవ తేజ అన్నారు. శనివారం సుంకేసుల రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం, అక్కడి నుంచి మునగాలపాడు పంపింగ్ స్టేషన్ వరకు చేపడుతున్న పైప్‌లైన్ పనులను పరిశీలించారు. అలాగే తాగునీటి సమస్యపై ప్రజారోగ్య సాంకేతిక శాఖ ఇంజినీర్లు, నగరపాలక ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రూ.82 కోట్లతో చేపడుతున్న పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ శేషసాయి, ఏఈ జనార్దన్, పబ్లిక్ హెల్త్ ఈఈ చంద్రమోహన్, డీఈ వెంకటేశ్వర్లు, ఏఈ నాగశేఖర్ పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కేంద్రం ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కేవీ నారాయణ డిమాండ్‌చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇప్పటికే నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుడు అల్లాడిపోతుంటే ఈ సమయంలో గ్యాస్ ధరలను పెంచడం అన్యాయమన్నారు. వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350 ధర పెరిగిందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన సమయంలో వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.430 ఉండేదని, అప్పుడు అది ఏకంగా రూ.1155 చేరిందన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.రాముడు,ఎం.రాజశేఖర్, అంజిబాబు, గురుశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు రుచికరమైన భోజనం అందించండి

కర్నూలు(హాస్పిటల్): రాష్ట్ర ప్రభుత్వం డైట్ ఛార్జీలు పెంచిన దృష్ట్యా రోగులకు, డ్యూటీలో ఉన్న వైద్యులకు రుచికరమైన భోజనం అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. శనివారం ఆయన ఆసుపత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా డైట్‌ను సందర్శించి అక్కడి సరుకుల వివరాలు సేకరించారు. రోగులకు, డాక్టర్లకు అందుతున్న డైట్ వివరాలపై ఆరా తీశారు. వచ్చేవారం నుంచి రోగులకు కూడా ఉదయం టిఫిన్‌లో ఇడ్లీలు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం మెడికల్ వార్డులను తనిఖీ చేశారు. మూడు, నాలుగవ యూనిట్లలో పారి శుధ్యం, పవర్ సప్లయ్, ఆక్సిజన్ సప్లయ్, మందుల సరఫరా, మందుల స్టాక్‌ను పరిశీలించా రు. ఆయన వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

సత్ప్రవర్తన కోసం బైండోవర్

కర్నూలు: కర్నూలు బుధవారపేటకు చెందిన పాత నేరస్తుడు బోయ కొలుట్లను సత్ప్రవర్తన కోసం పోలీసులు కల్లూరు తహసీల్దార్ రమేష్ బాబు ఎదుట హాజరుపరిచారు. ఈయన గతంలో సారా విక్రయిస్తూ పలుమార్లు పోలీసులకు పట్టుబడ్డాడు. మళ్లీ సారా వ్యాపారం వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం అందడంతో లక్ష్మీనగర్ వద్ద అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట హాజరుపరచి బైండోవర్ చేయగా రూ.లక్ష బాండ్ తీసుకుని సొంత పూచీకత్తుపై వదిలేశారు.

ధాబా నిర్వాహకుడి అరెస్టు...

నంద్యాల రోడ్డులోని కనకదుర్గ ధాబా నిర్వాహకుడు బోయ సత్యంను మూడవ పట్టణ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈయన కూడా 2020లో పాత నేరస్తుల జాబితాలో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. తాజాగా ధాబాలో తెలంగాణ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో తనిఖీ చేసి ఐదు మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : పఠాన్, బలగం, సార్, వినరో భాగ్యము విష్ణు కథ, ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు, ఇన్‌కార్, గ్యాంగ్ లీడర్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్ : వీరసింహారెడ్డి, సార్, బలగం, ఆర్గానిక్ మామ హైబ్రిడ్ అల్లుడు, ఇన్‌కార్, వినరో భాగ్యము విష్ణు కథ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సర్, బలగం, వినరో భాగ్యము విష్ణు కథ
ఐనాక్స్ : యాంట్ మ్యాన్ అండ్ ది వాస్ప్ క్వాంటమేనియా, క్రీడ్ –3
భరత్ కాంప్లెక్స్ : బిగ్ స్నేక్ కింగ్, వాల్తేర్ వీరయ్య
రాజ్ : గ్యాంగ్ లీడర్ **శ్రీరామ** : గ్రంథాలయం
విజయ : వినరో భాగ్యము విష్ణు కథ

కాసేపు గడిపితే టెన్షన్ మొత్తం పోతుంది..



ఈ చిత్రంలో కనిపించే వ్యక్తి పేరు జి.శ్రీనివాసులు. విద్యానగర్‌లోని వాసవీ హోమ్‌లో నివసిస్తున్నారు. ఈయన బంగారం వ్యాపారం చేస్తుంటారు. మూడేళ్ల క్రితం చెన్నైలో ఫగ్ జాతి కుక్కను రూ.25 వేలకు కొని తెచ్చారు. బొద్దుగా, ముద్దుగా ఉండే కుక్కను అపురూపంగా చూసుకుంటారు. ప్రతి ఏటా డిసెంబరు నెలలో దీనికి బర్త్‌డే వేడుకలు కూడా నిర్వహిస్తుంటారు. ప్రతి నెల దీని పోషణకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఖర్చు చేస్తారు. షాపు నుంచి ఇంటికి వెళ్లి కుక్కతో కాసేపు గడిపితే బంగారం షాపులోని టెన్షన్ మొత్తం పోతుందని చెబుతున్నారు.

టోటో అంటూ ముద్దుగా పిలుచుకుంటాం



ఈ మహిళ పేరు ఎ.సుధారాణి. కర్నూలు బుధవారపేట నివాసి. ఉదయం లేచింది మొదలు.. ఇంటి పనులు, వ్యాపార వ్యవహారాలతో ఉక్కిరిబిక్కిరవుతుంటారు. టోటోగా పిలుచుకునే కుక్కతో కాసేపు గడిపితే చాలు ఉదయం నుంచి పడిన శ్రమ మొత్తం వెళ్లిపోతుందని చెబుతున్నారు. ఏడేళ్ల క్రితమే స్విడ్జ్ జాతి కుక్కను బెంగళూరులో రూ.30 వేలకు కొని తెచ్చుకున్నారు. దీనికి ప్రతి జనవరిలో పుట్టిన రోజు వేడుక నిర్వహిస్తారు. తాము దానిని కుక్కగా కాకుండా కుటుంబంలో ఒక సభ్యురాలిగానే చూస్తామని, టోటో అంటూ ముద్దుగా పిలుచుకుంటామని చెబుతున్నారు. దీని పోషణకు ప్రతి నెల రూ.10 వేల వరకు ఖర్చు చేస్తున్నారు.

ప్రియ నేస్తం.. ఆత్మీయ బంధం

- నగరంలో పెరుగుతున్న కుక్కల పెంపకం
- ఒత్తిడి నుంచి ఉపశమనానికి శునకాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు
- ఖర్చుకూ వెనుకాడని వైనం
- కుటుంబ సభ్యుల వలే చూసుకుంటూ.. ముద్దుపేర్లు, ఘనంగా పుట్టిన రోజు వేడుకలు



కర్నూలు(అగ్రికల్చర్): పట్టణ ప్రజల అభిరుచులు మారిపోతున్నాయి. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు టెన్షన్ జీవితం. టెన్షన్ నుంచి ఉపశమనం పొందేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారు. వాకింగ్, జిమ్ తదితర వ్యాపకాలతోపాటు కుక్కల పెంపకాన్ని హ్యాబీగా చేసుకుంటున్నారు. ఇవి విశ్వాసానికి ప్రతిరూపం కావడంతోపాటు ఇంటికి రక్షణగా నిలుస్తుండటంతో గత రెండు, మూడేళ్ల నుంచి కర్నూలు నగరంలో ఫ్యాన్సీ కుక్కల పెంపకం ఎక్కువైంది. వీటి పెంపకంపై ముఖ్యంగా మహిళలు ప్రత్యేక ఆసక్తి చూపుతుండటం విశేషం.

మేలు జాతిపై ఇష్టం...

నగరంలో ఎక్కువ మంది మేలు జాతి కుక్కలను పెంచుకోవడానికే ఇష్టపడుతున్నారు. వీటి పోషణ ఖర్చుతో కూడుకున్నా వెనుకాడటం లేదు. మేలు జాతి శునకాల ధరలు రూ.10 వేల నుంచి రూ.30 వేలు ఆపైనే ఉంటున్నాయి. వీటిని పోషించడానికి నెలకు రూ.5 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు అవుతుంది. సంపన్న వర్గాలకు చెందిన వారే వీటిని పోషిస్తున్నట్లు తెలుస్తోంది. కర్నూలులోని కొండారెడ్డిబురుజు దగ్గర పశుసంవర్ధకశాఖకు చెందిన బహుళార్థ పశువైద్యశాల ఉంది. ఇక్కడికి చికిత్సకు రోజు 120 వరకు మూగజీవులను తెస్తుంటారు. ఇందులో 70 శాతం వరకు పెంపుడు కుక్కలే వస్తున్నాయంటే నగరంలో వీటి పెంపకం ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోంది.

కుక్కల రకాలు...

కుక్కలను మూడు రకాలుగా పోషిస్తున్నారు. ఫ్యాన్సీ రకంలో పోమొరెరీయిన్, స్పెట్జ్, గోల్డెన్ రిట్రీవర్, పగ్, డాషండ్ ముఖ్యమైనవి. ఇవి అందంగా, బొద్దుగా ఉంటాయి. మరో రకం ల్యాబ్‌రెడార్ జాతి కుక్క. వీటికి వాసన పసికట్టే సామర్థ్యం ఎక్కువ. పోలీసులు, ఆర్మీల్లో వీటిని పోషిస్తారు. సెక్యూరిటీ అవసరాలకు డాబర్‌మ్యాన్, ఆల్‌సెషన్/ జర్మన్‌షెఫర్డ్, రాట్‌వీలర్, గ్రేట్‌డేన్, రాజపాలెం, డాల్‌మేషన్, పందికోన(పత్తికొండ) కుక్కలు ప్రముఖమైనవి. కర్నూలు నగరంలో పై మూడు రకాల కుక్కలన్నీ ఉంటున్నాయి.

ప్రత్యేకంగా అలంకరించి ఆనందం

కుక్కలను యజమానులు తమ ప్రియ నేస్తాలుగా భావిస్తున్నారు. వాటిని తమ కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్నారు. వాటికి ముద్దు పేర్లు పెట్టుకొని ఆప్యాయంగా పిలుచుకుంటున్నారు. ఉదయం..సాయంత్రం వాటిని వాకింగ్‌కు తీసుకెళ్లడంతోపాటు రోజంతా పనిచేసి అలసి పోయి ఇంటికి వచ్చినప్పుడు వాటితే కాసేపు ఆడుకుంటూ ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతున్నారు. పేరుతో పిలుస్తే చాలు... పరిగెత్తుకుంటూ వచ్చి వళ్లో కూర్చుంటాయి. అవి ఆహారం తీసుకోకపోయిన, కాస్త నలతగా కనిపించినా తట్టుకోలేరు. వెంటనే పశువైద్యుల దగ్గరకు పరిగెడుతారు. పెంపుడు కుక్కలకు ప్రతి ఏటా పుట్టిన రోజు వేడుకలు నిర్వహించడం సర్వసాధారణం అయింది. పుట్టిన రోజు నాడు వీటిని ప్రత్యేకంగా అలంకరించి ఆనందం పొందుతున్నారంటే ఏ మాత్రం ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు.



పుట్టిన రోజు నాడు అలంకరణతో పగ్ జాతి కుక్క

కుక్కల పోషణలో జాగ్రత్తలు తప్పనిసరి



నగరంలో కుక్కల పెంపకం పెరుగుతోంది. అయితే కుక్కలను పోషించే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పుట్టిన 15 రోజులకు నట్టల నివారణ మందులు తాపాలి. తర్వాత నెలకు, 3 నెలలకు, ఆరు నెలలకు తాపాలి. 5 రకాల జబ్బులకు నోబివాక్ డీపీహెచ్‌హెచ్‌ఐ వ్యాక్సిన్‌లు వేయించాలి. మొదట 40 రోజులు, తర్వాత 70 రోజుల వ్యవధిలో వేయించాలి. 90 రోజుల వ్యవధిలో రేబిస్ వ్యాక్సిన్ వేయించాల్సి ఉంది. ఇలా చేయడం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటాయి. **–డాక్టర్ హేమంత్‌కుమార్, డీడీ, బహుళార్థ పశువైద్యశాల, కర్నూలు**

10న జాబ్‌మేళా

కర్నూలు సిటీ: స్థానిక ఏక్యాంపులోని మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో ఈ నెల 10వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వీర్కొ బయోటిక్ వారు నిర్వహిస్తున్న ఈ మేళాలో బీఎస్సీ, ఎంఎస్సీ, బీ ఫార్మసీ, డిప్లమా కోర్సులు పూర్తి చేసి, 20–22 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు పాల్గొనవచ్చన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేయండి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఏడీఈ–1 రాజమోహన్‌రెడ్డి సూచించారు. శనివారం ఆయన కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థ వినియోగదారుల కోసం ఫిర్యాదు నంబర్ 1912ను తీసుకొచ్చిందని, ఈ నంబరుకు చేసే ప్రతి ఫిర్యాదు ఆన్‌లైన్‌లో నమోదు అవుతుందని చెప్పారు. అలాగే ఏఈ కార్యాలయాలకు వచ్చే ఫిర్యాదులను తేదీ, సమయంతో నమోదు చేయడంతో పాటు పరిష్కరించిన తేదీ, సమయం వివరాలను నమోదు చేయాలని సూచించారు. దీంతో పనుల్లో జాప్యం, కారణాలు తెలుస్తాయన్నారు.

రక్తదానం

కర్నూలు(హాస్పిటల్): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రవీంద్ర డిగ్రీ కళాశాల విద్యార్థినులు రక్తదానం నిర్వహించారు. స్థానిక అబ్బాస్‌నగర్‌లోని కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. 150 మంది విద్యార్థినులకు రక్తనిర్ధారణ పరీక్షలు నిర్వహించి, అనంతరం రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ రమేష్‌బాబు, కళాశాల ప్రిన్సిపాల్ కె.జ్యోతి, కో ఆర్డినేటర్ లావణ్య పాల్గొన్నారు.

నేడు శోభాయాత్రపై సమావేశం

కర్నూలు కల్చరల్: శ్రీరామ నవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు వినాయక్ ఘాట్‌లోని సమావేశ మందిరంలో శ్రీరామ నవమి వేడుకల నిర్వహణకు సంబంధించి సమావేశం ఏర్పాటు చేసినట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. సమావేశంలో శ్రీరామ నవమి రోజున నిర్వహించే శోభాయాత్ర గురించి చర్చిస్తామని, వీహెచ్‌పీ, బజరంగ్‌దల్, బీజేపీ, వివిధ ధార్మిక సంస్థల సభ్యులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి

- అట్టహాసంగా రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం



రాష్ట్రస్థాయి పోటీల ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడుతున్న స్టేడియం సీఈఓ రమణ

కర్నూలు(టౌన్): క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ, న్యాయవాది శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో 8వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 13 జిల్లాల నుంచి తరలివచ్చిన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్ చేసి అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమ ఎప్పుడూ ముందుంటామన్నారు. కార్యక్రమంలో సీఐలు పార్థసారధి రెడ్డి, శ్రీనివాసులు, పోటీల నిర్వహణ కార్యదర్శి డాక్టర్ రుద్రారెడ్డి, స్టేడియం చీఫ్ కోచ్ నటరాజరావు, ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, రాష్ట్ర హ్యాండ్‌బాల్ సంఘం సభ్యులు బాబి, క్రీడాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

మొదటి రోజు హోరాహోరీగా...

మొదటిరోజే రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. గుంటూరు జట్టుపై 14–19 పాయింట్ల తేడాతో చిత్తూరు జట్టు గెలిచింది. 22–10 పాయింట్లతో నెల్లూరు జట్టుపై కర్నూలు జట్టు, 14–10 పాయింట్లతో శ్రీకాకుళం జట్టుపై వైఎస్సార్ కడప జట్టు, 23–16 పాయింట్లతో కృష్ణా జిల్లా జట్టుపై విశాఖపట్నం జట్టు, 12–08 పాయింట్లతో అనంతపురం జట్టుపై విజయనగరం జట్టు, 17–11 పాయింట్లతో గుంటూరు జట్టుపై కర్నూలు జట్టు, 18–08 పాయింట్లతో నెల్లూరు జట్టుపై చిత్తూరు జట్టు, 22–14 పాయింట్లతో వైఎస్సార్ కడప జట్టుపై పశ్చిమగోదావరి జట్టు, 18–14 పాయింట్లతో తూర్పుగోదావరి జట్టుపై విశాఖపట్నం జట్టు గెలుపొందాయి.

మండలి ఎన్నికల్లో రవీంద్రారెడ్డిని గెలిపించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): త్వరలో జరిగే శాసనమండలి ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరచిన పట్టభద్రుల అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన 9వ వార్డు పింజరి వీధిలో మండలి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. షాపులు, ఇళ్లు, అపార్ట్‌మెంట్లకు వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిది సంక్షేమ ప్రభుత్వమని, ఆయన బలపరచిన అభ్యర్థిని గెలిపించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రవీంద్రారెడ్డికే ఓటేయ్యాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

కర్నూలు(టౌన్): స్థానిక 17వ వార్డు పరిధిలోని చాణక్యపురి కాలనీలో ఉన్న సచివాలయాన్ని శనివారం జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టిక, మూవ్‌మెంట్ రిజిష్టర్ తదితర వాటిని పరిశీలించారు. ఎప్పటికప్పుడు ప్రజాసమస్యలను పరిష్కరించాలన్నారు.

ర్యాగింగ్ నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్ నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. శనివారం ఆయన కళాశాల కౌన్సిల్ హాలులో హెచ్‌వోడీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వరంగల్‌లో మెడికో ప్రీతి మరణం దృష్ట్యా కర్నూలు మెడికల్ కాలేజీలో ర్యాగింగ్‌కు తావులేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కళాశాలలోని ఇతర కమిటీలకు తగిన వారి పేర్లను హెచ్‌వోడీలు ప్రతిపాదించాలని కోరారు. కళాశాల అభివృద్ధి నిధులను ఖర్చు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు అందజేయాలన్నారు. సెకండియర్ పీజీ విద్యార్థులు తప్పనిసరిగా డిస్ట్రిక్ట్ రెసిడెన్సి ప్రోగ్రామ్‌కు వెళ్లే విధంగా చూడాలని, ఫైనలియర్ విద్యార్థులు తప్పనిసరిగా వార్డులకు రావాల్సిందేనని చెప్పారు. వారికి పరీక్షల సన్నాహక సెలవులు ఉండవన్నారు. వైద్య విద్యార్థులు రాత్రిళ్లు హాస్టళ్లలోనే ఉండాలని, బయట తిరిగితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.నరేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రేణుక, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్ పాల్గొన్నారు.

లింగనిర్ధారణ చేసే వైద్యులపై చర్యలు

కర్నూలు(హాస్పిటల్): గర్భస్థ లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, ఇలాంటి చర్యలకు పాల్పడే స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం స్థానిక జోహారాపురం రోడ్డులోని కిమ్స్ హాస్పిటల్‌లో గర్భవతులు, మహిళలకు పీసీ పీఎన్‌డీటీ యాక్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో స్త్రీ, పురుషులు ఇరువురూ సమానమేనని, వారి మధ్య వివక్ష ఉండకూడదన్నారు. ఏడవ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్ జడ్జి జి.భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ చట్టాలు, శిక్షలు నేరాలను కొంత వరకు తగ్గిస్తాయన్నారు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తికి కొడుకు, కూతురికి సమాన హక్కులు ఉన్నాయని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య, విజయ హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ బాలమద్దయ్య, కిమ్స్ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రంజిత్‌రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతు ఇవ్వండి

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతూ ఇవ్వాలని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి డా.చామల అనిల్ వెంకట ప్రసాద్ రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం నగరంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయలతో నిర్వహించిన సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. విద్య, వైద్య రంగంపై తనకు సంపూర్ణ అవగాహన ఉందన్నారు. సమావేశంలో రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రుడు, ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాల అధినేతలు పాల్గొన్నారు.

'అక్రమ సొమ్ముతో ప్రతిపక్షం గెలవాలని చూస్తోంది'

కర్నూలు సిటీ: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులను ప్రతిపక్ష పార్టీ అక్రమ సొమ్ముతో గెలవాలని చూస్తోందని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డా.పోతుల నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని ఓ లాడ్జీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఏ రోజు కూడా పట్టభద్రుల సమస్యలపై ఎలాంటి పోరాటం చేయని ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియా ద్వారా కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతోందన్నారు. టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వ్యక్తి 275 ఎకరాలు పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములను కొల్లగొట్టారని, వాటిపై ప్రస్తుతం పులివెందుల ఆర్టీఓ ఆఫీస్‌లో విచారణ జరుగుతోందన్నారు. పీడీఎఫ్ సంస్థ తరుపున ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేసే వారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు.

'బీజేపీ గుండాల దమనకాండను ఖండించండి'

కర్నూలు(సెంట్రల్): త్రిపురలో బీజేపీ గుండాలు సీపీఎం కార్యకర్తలపై చేస్తున్న దమనకాండను ప్రతి ఒక్కరూ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పేర్కొన్నారు. బీజేపీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని, ప్రజల తీర్పును అపహాస్యం చేస్తూ దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. శనివారం త్రిపురలో బీజేపీ దాడులను ఖండిస్తూ కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎం.రాజశేఖర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

- ఉల్లంఘిస్తే వాహన యజమానులు, తల్లిదండ్రులపై కేసులు



స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇవ్వొద్దని ట్రాఫిక్ డీఎస్పీ ఎం.నాగభూషణం అన్నారు. దీనిని ఉల్లంఘిస్తే ఆ వాహనాల యజమానులు, తల్లిదండ్రులు, సంరక్షకులపై కేసులు నమోదు చేస్తామని, కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు నగరంలోని ముఖ్యమైన ప్రదేశాల్లో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రాజ్‌విహార్ సెంటర్‌లో మోటర్ వాహనాలపై త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 29 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులు నమోదు చేసి రూ.44,515 జరిమానా విధించారు. అనంతరం వారిని కొత్తపేట వద్ద ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి తల్లిదండ్రులను రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి అవగాహనా లోపంతో వారు చేసే రోడ్డు ప్రమాదాలకు బాధ్యులు కావద్దని తల్లిదండ్రులకు హెచ్చరించారు. మైనర్లు, లైసెన్స్‌లు లేనివారికి వాహనాలు ఇచ్చే యజమానులు, తల్లిదండ్రులు, గార్డియన్లపై ఐపీసీ 304 సెక్షన్ కింద పదేళ్ళ, 308 సెక్షన్ కింద ఏడేళ్లు శిక్ష విధించే అవకాశముంటుందన్నారు. భవిష్యత్తులో మైనర్లకు వాహనాలు అప్పగించమని, ట్రాఫిక్ నిబంధనలు ఇకపై ఉల్లంఘించమని వారి చేత డీఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు.

ఏకాగ్రతతో కష్టపడితే విజయం వరిస్తుంది



ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న కర్నూలు డీఎస్పీ కె.వి.మహేష్

కర్నూలు: పోలీసు శాఖలో ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సాధన చేసే అభ్యర్థులు ఏకాగ్రతతో కష్టపడితే విజయం వరిస్తుందని కర్నూలు డీఎస్పీ కె.వి.మహేష్ అన్నారు. నగరంలోని మేడం విజయ్ గ్రాండ్ హోటల్‌లో శనివారం ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల అభ్యర్థులకు కర్నూలు ప్రగతి సమితి అధ్యక్షులు ఎం.శ్రీహర్ష ఆధ్వర్యంలో టీషర్టుల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా డీఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో ఉద్యోగం సాధించాలనేవారు నిరంతరంగా మంచి ఆలోచనతో సంతోషంగా ఉంటూ చదువుతున్న అంశాన్ని క్షుణ్ణంగా ఏకాగ్రతతో చదివితే ఉద్యోగ పరీక్షల్లో తప్పక విజయం సాధిస్తారన్నారు. అనంతరం డీఎస్పీను కేపీఎస్ అధ్యక్షుడు శ్రీహర్ష శాలువతో సత్కరించారు. అనంతరం ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు డీఎస్పీ చేతుల మీదుగా టీషర్టులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేపీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ఆరోగ్య, యోగా సెంటర్



ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రిపుల్ ఐటీ గౌరవ అధ్యక్షుడు రంగనాథ్

కర్నూలు సిటీ: నగర శివారులోని జగన్నాథగట్టుపై ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిపుల్ ఐటీ డీఎం)లో శనివారం శ్రీధన్వంతరి హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, పతంజలి మహర్షి యోగా సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సెంటర్‌ను ట్రిపుల్ ఐటీ డీఎం గవర్నర్ బోర్డు గౌరవ అధ్యక్షుడు ఆచార్య హెచ్.ఏ రంగనాథ్, డైరెక్టర్ డీవీఎల్ఎన్ సోమయాజులు ప్రారంభించి ప్రసంగించారు. ఆరోగ్య, యోగా కేంద్రాలలో 24 గంటలు సేవలతోపాటు అత్యవసర వైద్య సేవలు కూడా అందిస్తారన్నారు. ఆరోగ్య కేంద్రంలో ఈసీజీ, కార్డియాక్ మానిటర్, ఆక్సిజన్ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వీటితో పాటు కేంద్రంలో ఆరు పడకలతో ఇన్ పేషెంట్ సౌకర్యాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఐఐటీ తిరుపతి డైరెక్టర్ ఆచార్య కె.ఎన్ సత్యనారాయణ, ఆ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో హార్డ్‌వేర్ ఇంజినీర్ మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శ్రీకాంత్‌రెడ్డి

కర్నూలు: కర్నూలు శివారులోని డోన్ రోడ్డులో రింగ్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హార్డ్‌వేర్ ఇంజినీర్ వై.శ్రీకాంత్‌రెడ్డి (40) మృతిచెందాడు. కిసాన్ నగర్‌లో నివాసముంటున్న రిటైర్డ్ ఏఎస్ఐ ఆదినారాయణరెడ్డికి ఒక కూతురు, కొడుకు సంతానం. కుమారుడు శ్రీకాంత్‌రెడ్డి బెంగళూరులో హార్డ్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం బెంగళూరు నుంచి కర్నూలుకు వచ్చాడు. శనివారం ఉదయం 7:45 గంటల సమయంలో మయూరి హోమ్స్‌లో ఉన్న బంధువులను కలుసుకునేందుకు స్కూటర్‌పై వెళ్తుండగా కర్నూలు నుంచి డోన్ వైపు వెళ్తున్న ఐచర్ వాహనం వేగంగా ఢీకొట్టి తలపై వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి ఫోన్ ద్వారా వరుసకు సోదరుడైన ప్రదీప్‌రెడ్డి ఫోన్‌కు స్థానికులు సమాచారం చేర్చడంతో ఆయన హుటాహుటిన అక్కడికి చేరుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే భార్య ఐశ్వర్య కూడా బెంగళూరు నుంచి కర్నూలు చేరుకుంది. మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.